

కాటేస్తున్న.. కత్తెర పురుగు

- జిల్లాలో విస్తారంగా ఆరుతడి పంటలు
- ఆరుతడి పంటలకు చీడపీడల బెడద
- సోయా, మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు ప్రభావం
- పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందంటున్నరైతులు
- కత్తెర పురుగు నివారణపై చర్యలు
- ఎరువులను మోతాదులో వేసుకోవాలంటున్న వ్యవసాయ అధికారులు



జిల్లాలో సోయా పంటపై ఆశించిన కత్తెర పురుగు

కామారెడ్డి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరుతడి పంటలైన సోయా, మొక్కజొన్న, పత్తి, కందులు, పెసర్లు, మినుములను రైతులు విస్తారంగానే సాగు చేశారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఆరుతడి పంటలు సాగవుతున్నందున ఈ పంటలపై చీడపీడల బెడద వేదిస్తోంది. ప్రధానంగా సోయా, మొక్కజొన్న పంటలను లద్దెపురుగు జాతికి చెందిన కత్తెర పురుగు కాటేస్తోంది. దీంతో పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు పంటలు ఏపుగా పెరుగుతున్న దశలో తెగుళ్లు సోకి ఎండిపోతోంది. దీంతో రైతులు పంటకు అనేక రసాయనిక మందులను పిచికారీ చేసి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే మళ్లీ కత్తెర పురుగు వెంటాడుతోంది. ఈ సీజన్‌లో సోయా, మొక్కజొన్న పంటల్లో తెగుళ్ల అధికంగా వ్యాపిస్తుందని రైతులు తెలుపుతున్నారు. పురుగు సోయా, మొక్కజొన్న కాండం లోపలికి ప్రవేశించి గుజ్జుతో పాటు కంకులను కూడా వదలకుండా తినేయడంతో పంట ఎదుగుదల లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్నకు ఈ సీజన్‌లోనే కాకుండా గతంలోనూ కత్తెర పురుగు సమస్యగా మారిందని ఆ సమస్య ఇంకా వదలడం లేదని వాపోతున్నారు.

జిల్లాలో ఆరుతడి పంటల సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ఆరుతడి పంటలైన సోయా, మొక్కజొన్న, పత్తి, కందులు, మినుములు, పెసర పంటలను విస్తారంగా రైతులు సాగు చేశారు. సుమారు ఈ ఆరుతడి పంటల సాగు జిల్లాలో 2లక్షల ఎకరాలకు పైగానే ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 3.10లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో సోయాబిన్ 79,424 ఎకరాలు, మొక్కజొన్న 29, 927, పత్తి 24,311, కందులు 18,425, మినుములు 4,330, పెసర్లు 4,596, వరి 1లక్ష 80వేల ఎకరాల్లో సాగైంది. అయితే జిల్లాలో అడపాదడపగా కురుస్తున్న వర్షాలకు పంటలపై చీడపీడల ప్రభావం ఎక్కువవుతోంది.

పంటల దిగుబడిపై ప్రభావం

కత్తెర పురుగు పంటకు తీవ్ర నష్టం కల్గిస్తోంది. అంతేకాకుండా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పుడు వ్యాపించిన కత్తెర పురుగు సోయా, మొక్కజొన్న పూత,కాత సమయం వరకు పంటపై వ్యాపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రత ఇలాగే ఉంటే పంట దిగుబడి ప్రమాదం ఉంటుందని రైతులు దిగాలు పడుతున్నారు. జిల్లాలోని బిచ్కుంద, పెద్ద కొడప్‌గల్, తాడ్వాయి, సదాశివనగర్, గాంధారి, రాజంపేట, భిక్కనూర్ తదితర మండలాల్లో వేల ఎకరాల్లోనే సోయా, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. అందులో చాలా వరకు కత్తెర పురుగు ఆశించిందని రైతులు చెబుతున్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు

కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను ముందు దశలోనే ఉన్న పంటకు మూడు కేజీలు గులికలు ఎకరానికి మూడు కిలోల చొప్పున సుడిలో మందులను వేసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు ప్లోరీపైరిఫాస్ 400 ఎంఎల్, వినాల్‌ఫాస్ 400ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి మధ్యస్థ దశలో ఉన్నప్పుడు హిమమెట్టిం బెంజయోల్ 80 గ్రాములు, సైబనోఫాస్ 60 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉంటే ప్లోరాంత్రానిలో 60 ఎంఎల్, లామ్‌సైలోథిన్ 200 ఎంఎల్ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేస్తే పురుగు నివారణ తగ్గించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



తీజ్ పండుగలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కార్

తెలంగాణ మహిళలను అవమానించే విధంగా కేటీఆర్ వ్యాఖ్యలు

- ఆడవాళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారికి తగిన బుద్ధి చెబుతాం
- జిల్లాలో 6 వేల రుణమాఫీ దరఖాస్తులు మాత్రమే పెండింగ్
- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 18: రాష్ట్రంలో మహిళలకు బస్సు ప్రయాణాల్లో ఇబ్బందులు తలెత్తవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెడితే ఎక్కడ తమ రాజకీయ భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందోనని బీఆర్‌ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. ఆదివారం కామారెడ్డిలోని క్లాసిక్ ఫంక్షన్‌హాల్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సన్మాన కార్యక్రమం, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ మహిళలను అవమానించే విధంగా ఎమ్మెల్యే కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయని ఆడవారిని బ్రేక్ డ్యాన్స్‌లు చేసుకోవాలని అనడం సిగ్గుచేటని అన్నారు. ఆడవాళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారికి తగిన బుద్ధి చెబుతామని అన్నారు. గృహజ్యోతి, రుణమాఫీలో చిన్నచిన్న పొరపాట్లు చోటు చేసుకుంటున్నాయని వాటిని ప్రభుత్వ అధికారులు సరి చేస్తున్నారని అన్నారు. ఈ అంశాలను తమ రాజకీయ లబ్ధి కోసం బీఆర్‌ఎస్ నాయకులు వాడుకుంటూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. రుణమాఫీకి ప్రతీ కలెక్టర్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నెంబర్ పెట్టి వారి సమస్యలను తీరుస్తూ వారికి రుణమాఫీ అయ్యేలా చూస్తున్నామని తెలిపారు. జిల్లాలో రుణమాఫీ కోసం 90 వేల దరఖాస్తులు వస్తే 6 వేల దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, అందులో 2 వేల దరఖాస్తులు ఆధార్‌కార్డులో ఉన్న పొరపాట్ల వల్ల ఆగాయని తెలిపారు. అందరికీ మాఫీ అయ్యేలా కమిటీని వేస్తున్నామని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉండి రుణమాఫీ గురించి మాట్లాడని కేసీఆర్, కేటీఆర్‌లు ఇప్పుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇక సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని అన్నాడని ఇప్పుడు రుణమాఫీ చేశామని మరి మాట మీద నిలబడి రాజీనామా చేస్తావా హరీష్‌రావు అని ప్రశ్నించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ముఖ్యమంత్రులపై గెలిచానని రాష్ట్రమంతా చెప్పుకుని తిరగడానికి 9 నెలలు పట్టిందని కామారెడ్డి అభివృద్ధి గాలికి వదిలేసి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ మర్చిపోయాడని అన్నారు. కామారెడ్డిలో 150 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పింది ఆయన నిబద్ధతకే వదిలేస్తున్నామన్నారు. అనంతరం ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పెద్దమనసుతో ఆదరించి గెలిపించినందుకు కామారెడ్డి ప్రజల రుణం తీర్చుకుంటానని షబ్బీర్‌అలీ సహకారంతో కామారెడ్డి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. అనంతరం అశోక్‌నగర్ కాలనీలో తీజ్ పండుగ వేడుకలకు హాజరయ్యారు. అంతకు ముందు ఎల్లమ్మగుడి వద్ద గల పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగ

- నేడు రక్షాబంధన్
- రాఖీలు కట్టేందుకు అక్కా చెల్లెళ్ల హడావుడి
- రాఖీలు, స్వీట్ల కొనుగోళ్లలో మహిళలు బిజీబిజీ



కామారెడ్డిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డి/కామారెడ్డి టౌన్, ఆగస్టు 18: రాఖీ పండుగ సంబరం ప్రారంభమైంది. రాఖీ వేడుకలను సోమవారం జరుపుకునేందుకు అక్కా చెల్లెళ్ల హడావుడి ప్రారంభమైంది. అన్నా చెల్లెలు, అక్కడ తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచికగా రాఖీ పండుగను జరుపుకుంటారు. రాఖీ అంటే రక్షణ బంధం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఎక్కడ చూసినా రాఖీలు స్వీట్ల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

జోరుగా రాఖీల విక్రయాలు

రకాలను బట్టి ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. రూ.10 నుంచి మొదలుకుని వందకుపైగా ధరలతో కూడా రాఖీల ధరలు ఉన్నాయి. అంతేగాక కొందరు ఆర్థికంగా ఉన్నంతగా ఉన్న వారు వెండి బంగా రంతో కూడిన రాఖీలను కూడా ప్రత్యేకంగా తమ సోదరులకు కడుతుంటారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఆదివారం వారాం తపు సంత కావ డంతో ప్రధాన రహదారి పక్కన వీక్లి మార్కెట్ గాంధీచౌక్ బస్టాండ్ రహదారుల వెంట దుకాణాల వద్ద ప్రత్యేకంగా రాఖీ స్టాళ్లను ఏర్పాటు చేసి విక్రయి స్తున్నారు.

సోదరుల వద్దకు..

దూర ప్రాంతాల్లో ఉన్న అక్కా చెల్లెళ్లు, అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు వెళుతున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు బస్సులు, రైళ్లల్లో బయలుదేరి వెళుతున్నారు. ఇక రాఖీలు కడితే ఆ సోదరులు తమ అక్కా చెల్లెళ్ల ఆనందంగా ఉండాలని కోరుకుంటూ వారికి కట్న కానుకలు సమర్పిస్తారు. కొందరు ఇష్టమైన వస్తువులను కొనిస్తారు. మరికొందరు బట్టలు పెట్టి తమకు తగిన విధంగా అక్కా చెల్లెళ్లను ఆనందపరుస్తారు. రక్షా బంధన్ రోజున వారి ప్రేమానురాగాలను పంచుకుంటారు.

స్వీట్లకు భలే గిరాకీ

రాఖీ కట్టే అక్కా చెల్లెళ్లు తమ వెంట స్వీట్లను తీసుకెళ్తారు. రాఖీలను కట్టి వారు ఉన్నతంగా ఉండాలని కోరుకుంటూ సీట్లను తినిపిస్తారు. దీంతో రాఖీలతో పాటు స్వీట్లకు కూడా గిరాకీ పెరిగింది. కొందరు రాఖీలను కొనుగోలు చేసి స్వీట్ల దుకాణాలకు వెళ్లి తమ కిష్టమైన సీట్లను కొనుగోలు చేస్తున్నారు. సీట్ల దుకాణాల యజమానులు రకాన్ని బట్టి డిమాండ్ ఉన్న రకరకాలకు ధరలను పెంచి విక్రయిస్తున్నారు.

పాపన్నగౌడ్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 18: పాపన్నగౌడ్ సాహసాన్ని, పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌర్జన్యాన్ని ఎదిరించి తెలంగాణ ప్రాంతానికి న్యాయం చేశారని అన్నా రు. సామాన్య కుటుంబంలో పుట్టి తెలంగాణ ప్రాంతాన్ని కొంత కాలం పాటు పాలించి ఆదర్శప్రాయుడిగా నిలిచారని అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ పాపన్నగౌడ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గీత కార్మికులు చెట్లు ఎక్కడానికి రాష్ట్రప్రభుత్వం సేఫ్టీమోపు అనే యంత్రాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, టీఎన్‌జీవోస్ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సాయిలు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై పట్టింపేది?

- లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, శివారు కాలనీల్లో ప్రజల అవస్థలు
- ప్రధాన రహదారుల వెంట అస్తవ్యస్తంగా మురికి కాలువలు
- మురికి కాలువలపై నిర్మాణాలతో చినుకుపడితే వరద నీటి కష్టాలు
- ఆయా కాలనీల్లో ఏళ్ల తరబడి వరద నీటి సమస్య
- ఐదేళ్లకోసారి ప్రజాప్రతినిధులు మారుతున్నారే తప్ప ప్రజల అవస్థలు మారడం లేదు

కామారెడ్డి టౌన్, జూన్ 8: ప్రతీ ఐదేళ్లకోసారి ఎన్నికలు రావడం ఆ ఎన్నికల్లో పాతవారి స్థానంలో కొత్తవారు ఎన్నికయిన కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ప్రజల సమస్యలు మాత్రం పాతగానే ఉంటున్నాయే తప్ప వారికి కొత్త రూపురేఖలు చూపడం లో గెలిచిన ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం విఫలమవుతునే ఉన్నారు. వేసిన రోడ్లపైనే డబుల్ రోడ్లు వేస్తు, నిర్మించి రెండు సంవత్సరాలు కాకముందే దాని స్థానంలో మరో మురికి కాలువలను నిర్మిస్తున్నారే తప్ప పలుచోట్ల ఏళ్ల తరబడి సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుదామని కౌన్సిలర్‌లకు కనీస పట్టింపు లేకుండా ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధాన రహదారులను సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తున్నామంటూ చెప్పుకునే నాయకులు ఆయా వార్డుల్లో సంవత్సరాల తరబడి కనీస రోడ్లు లేక, మురికి కాలువలు లేక, ప్రధాన రహదారుల వెంట వరదనీరు వెళ్లక, చిన్నపాటి వర్షం పడితే మురికినీరు ఇళ్ల ముందు వచ్చి చేరి ప్రజలు నానా అవస్థలు పడుతున్నా వారికి శాశ్వత పరిష్కారం చూపే నాథుడే కరువయ్యాడు. గత ప్రభుత్వంలో పట్టణ ప్రగతిలో గుర్తించిన సమస్యలను సైతం ఇప్పటికీ తీర్చకపోవడం మున్సిపల్ అధికారుల, ప్రజాప్రతినిధుల పనితీరుకు నిదర్శనం.

చినుకుపడితే చిత్తడే..

కామారెడ్డి పట్టణంలో చిన్నపాటి చినుకు పడితే చాలు ఆయా వార్డుల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. రోడ్ల వెంబడి గుంతలు, వర్షపు నీరు ప్రవహించేందుకు మురికి కాలువలు లేకపోవడం, ఉన్నచోట్ల పూడికలు సరిగ్గా తీయకపోవడం, కొన్నిచోట్ల మురికి కాలువలను మొత్తం మూసివేయడంతో వర్షపు నీరు నిలిచి రోడ్ల వెంట ప్రయాణించాలంటేనే ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. చిన్నపాటి వర్షాలు కురుస్తేనే రోడ్ల వెంట ఉన్న గుంతల్లో నీరు చేరి మడుగులు కడుతున్నాయి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, శివారు కాలనీల్లో మాత్రం ఈ సమస్య తీవ్రంగా ఏర్పడుతోంది. జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లు మాత్రం అందంగా తీర్చిదిద్దిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ రోడ్ల వెంట మురికి కాలువల పరిస్థితిని మాత్రం మరిచారు. వరద తగ్గిన తర్వాత అక్కడే మిగిలిపోతున్న వ్యర్థాలతో దుర్గంధం, ఈగలు, దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

దారుణంగా మారిన మురికి కాలువ పరిస్థితి

కామారెడ్డిలోని ప్రధాన రహదారులు మాత్రమే శుభ్రం చేస్తున్నారే తప్ప అంతర్గత రోడ్లలో శుభ్రత, ప్రధాన రోడ్లలోని మురికి కాలువలపై నిర్మాణాలు వాటిలో నిలిచిన పూడికతీత, మురికి కాలువలపై చేపట్టిన నిర్మాణాలపై అసలు పట్టించుకున్నవారే కరువయ్యారు. దీంతో చాలా చోట్ల మురికి కాలువల పరిస్థితి దారుణంగా తయారైంది. చిన్నపాటి వర్షం పడితే చాలు ఏళ్ల తరబడి నీరంతా రోడ్లపై మడుగులు కట్టి రోగాలకు ఆవాసాలుగా మారుతున్నా కనీస చర్యలు కరువయ్యాయని ప్రజలు పెదవివిరుస్తున్నారు. నిజాంసాగర్ రోడ్డు నుంచి జీవదాన్ పాఠశాల వరకు నిత్యం వందలాది మంది కళాశాల, పాఠశాల విద్యార్థులతో పాటు అనేక గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారు. ఈ ప్రాంతంలో ఎన్నోసంవత్సరాలుగా వరదనీటి కష్టాలు ఉంటూనే ఉన్నాయి అయినా ఎవరికి కనీస పట్టింపులేకుండా పోతోంది. ప్రధానంగా వ్యాపారసంస్థల నిర్వహణ ప్రాంతాల్లో మురికి కాలువలను పూర్తిగా మూసివేయడంతో ఆ ప్రాంతాల్లో మురికి కాలువల వెంట పూడిక మట్టి పేరుకపోయింది. పలుచోట్ల ఆ నాలాలపై నిర్మాణాలు చేపట్టిన మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు పేర్కొంటున్నారు. ఇక విద్యానగర్ సాయిబాబా గుడి నుంచి కొత్త బస్టాండ్ వెళ్లే ప్రాంతం, జీవదాన్ పాఠశాల వైపు వెళ్లే ప్రాంతంలో మురుగుకాల్వల పరిస్థితి దారుణంగా తయారైంది. చాలా చోట్ల అసలు మురికి కాలువలు అనేవి లేవు. వర్షం పడితే నీరంతా వచ్చి సాయిబాబా గుడి ప్రాంతంలో మడుగులు కట్టే పరిస్థితి ఏళ్ల తరబడి ఉంది. ఇక నిజాంసాగర్ రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మురికి కాలువను మొత్తానికి మూసి వేశారు. చిన్నపాటి రంధ్రం ద్వారా నీరు పోక నీరు మడుగులు కడుతోంది. రైల్వే కమాన్ కింద పట్టణ పోలీసుస్టేషన్ ముందు పరిస్థితి దారుణం. ఆ మురికి కాలువలో పూడిక పేరుకపోవడం, మురికి కాలువల ద్వారా నీరు పోకుండా నిర్మాణాలు చేపట్టడంతో చిన్నపాటి కుంటను తలపిస్తోంది. ఈ రోడ్డు వెంట ఇందిరాగాంధీ చౌరస్తా వరకు ఇదే పరిస్థితి నెలకొంటుంది. అసలు ఆ మురికికాలువ ఎన్ని సంవత్సరాల కింద నిర్మించారనేది అంతుచిక్కని ప్రశ్న. ప్రతీసారి నీరు నిల్వడం ట్యాంకర్ల ద్వారా తోడేయడం చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడంలేదు. ఇక సిరిసిల్లా రోడ్డు నుంచి వీక్లి మార్కెట్‌కు వచ్చే ప్రాంతంలో కనీసం మురికి కాలువలు లేక ఏళ్లు గడుస్తున్నాయి. కల్లు కంపౌండ్ ముందు నుంచి సిరిసిల్లా రోడ్డు వరకు అసలు మురికి కాలువలనేవే లేవు. ఈ రోడ్డులో నిత్యం వందలాది మంది ప్రయాణాలు చేస్తున్నా ఇప్పటి వరకు మురికి కాలువల నిర్మాణం చేపట్టకపోవడం చూస్తేనే తెలుస్తోంది. పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి బంగారు దుకాణ సముదాయాల వద్ద గతంలో నూతన మురికి కాలువలు నిర్మించిన సరైన ప్రణాళికలు లేకుండా నిర్మించడంతో మురికి కాలువల నిర్మాణం జరిగింది కానీ ప్రజలకు మురికినీటి అవస్థలు మాత్రం తీరలేదు. వీటితో పాటు శివారు ప్రాంతాల్లోని అవస్థలు చెప్పనక్కరల లేదు. ఆయా వార్డుల్లో కౌన్సిలర్‌లు మాత్రమే మారుతున్నారే తప్ప ప్రజల అవస్థలు మాత్రం మారడం లేదు. ఇలా అనేక సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



నిజాంసాగర్ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏళ్ల తరబడి నెలకొనే పరిస్థితి

కౌన్సిలర్లు మారుతున్నారే తప్ప ప్రజల అవస్థలు మారడం లేదు

ప్రతీసారి ఎన్నికలు రావడం కాలనీల్లో ప్రధాన సమస్యలను ముందు వేసుకుని మేము గెలిస్తే ఇది చేస్తాం.. అది చేస్తాం.. ప్రజల అవస్థలు తీరుస్తామని కౌన్సిలర్‌లుగా పోటీ చేస్తున్న సమయంలో చెబుతూ పాత వారి స్థానంలో కొత్తవారు వస్తున్నారే తప్ప ప్రజల అవస్థలు మాత్రం తీర్చడం లేదు. గత ప్రభుత్వంలో పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో పారిశుధ్య పనుల్లో భాగంగా వచ్చిన అధికారులకు, కౌన్సిలర్‌లకు ప్రజలు చెప్పిన విషయాలను రాసుకుని పోయారే తప్ప వారు పడుతున్న ఇబ్బందులు మాత్రం ఇప్పటికీ తీరనే లేదు. పట్టణంలో చాలా చోట్ల ఇంకా మట్టిరోడ్లు, మురికి కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్న ఉన్నతాధికారులు సైతం అసలు ఎందుకు పట్టించుకోవడం లేదనే వాదనలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. కొందరు కౌన్సిలర్‌లు తమ వార్డుల్లో చేపట్టిన రోడ్లపైనే మరోమారు రోడ్లు వేస్తు, రెండు, మూడు ఏళ్ల వ్యవధిలో నిర్మించిన మురికి కాలువలను మరోసారి నిర్మాణాలు చేపట్టడం లాంటివి చేస్తున్నారే తప్ప అసలు మురికి కాలువలు, రోడ్లు లేని చోట నిర్మాణాలు చేపట్టడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. మరో ఐదు నెలల సమయంలోనైన ప్రజల అవస్థలు తీర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రజల అవస్థలు తీర్చుతారా లేదంటే మరోమారు ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ప్రజల నుంచి ఓట్లు అడుగుతారో వేచి చూడాలి.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవీపేట, ఆగస్టు 18: మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట కాలనీకి చెందిన ముత్యమ్మ అనే మహిళ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబం నిరుపేదకు చెందిన వారు కావడంతో మీకోసం మేము సేవ సంస్థ ఆద్వర్యంలో 8వేల రూపాయల ఆర్థిక సహయాన్ని సంస్థ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన పలువురు యువకులు సైతం మరో 6వేల రూపాయల విరాళాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో మహిపాల్, మోహన్, రాజు, శ్రావణ్, కృష్ణ, తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లావాసికి బంగారు పతకాలు



మిట్టపల్లి రిత్విక

నవీపేట, ఆగస్టు 18: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ ఫుల్‌లో ఆదివారం జరిగిన 9వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్ షిప్-2024 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో మండలంలోని బినోలకు చెందిన మిట్టపల్లి రిత్విక మూడు బంగారు పతకాలను సాధించింది. తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. 50మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం, వంద మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం, 200మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం సాధించి కర్నాటకలోని మంగళూరులో సెప్టెంబర్ 10నుండి 13వరకు జరిగే 77వ నేషనల్ అక్విటిక్ చాంపియన్ షిప్ 2024 పోటీలలో పాల్గొనడానికి మిట్టపల్లి రిత్విక అర్హత సాధించింది. రాష్ట్రస్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనడానికి ఎంపికైన మిట్టపల్లి రిత్వికను తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు మైపాల్ రెడ్డిలు అభినందించారు.

జిల్లాస్థాయి చెస్ ఎంపికలు పూర్తి

సుభాష్‌నగర్, ఆగస్టు 18: జిల్లాస్థాయి అండర్-11 చెస్ ఎంపికలు జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ క్రీడా మేధాశక్తిని పెంచుతుందన్నారు. అనంతరం ఈ పోటీలలో విజేతలైన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. బాలుర విభాగంలో అభిజిత్, అత్వర్ తోర్వే, బాలికల విభాగంలో నాగజ్యోత్స్నిక, సహస్ర రాథోడ్‌లు విజయం సాధించారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మహిపాల్

సుభాష్‌నగర్, ఆగస్టు 18: ధర్మసమాజ్ పార్టీ నిజామాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా మంగ్లారం మహిపాల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిపాల్ గత కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ విశారాధన్ మహారాజ్ భావజాలాన్ని జిల్లాలో వ్యాప్తి చేస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం విశారాధన్ మహారాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో డీఎస్‌పీని విస్తృతం చేసి పేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



ఖిల్లా, ఆగస్టు 18: వాహనదారులు వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పకుండా ధరించాలని నాల్గవ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ ఆదేశాల మేరకు నగర ఇన్స్‌పెక్టర్ నరహరి నేతృత్వంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు చోట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే పరిణామాల గురించి వివరించారు. ఈ అవగాహన సదస్సులో పోలీసులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్


సిరికొండలో రాస్తారోఖో చేస్తున్న ప్రజా సంఘాల నేతలు



క్యాండిల్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న స్టూడెంట్ యూనియన్ సభ్యులు


మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ప్రజాపంథ నాయకులు


బోధన్‌లో కామంధుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

పెద్దబజార్, ఆగస్టు 18: పశ్చిమబెంగాల్‌లో ఆర్జికర్ కళాశాల వైద్యురాలు అత్యాచార ఘటన దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైద్యురాలికి సంబంధించిన అత్యాచార ఘటన కేసు విచారణ వెంటనే పూర్తి చేయాలని దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఒక మెట్రోపాలిటన్ నగరంలో ఉన్న వైద్య కళాశాలలో ఇంత పెద్ద ఘటన జరగడం సమాజంలో మహిళలకు రక్షణ లేదని అనడం నిదర్శనమన్నారు. కేవలం అత్యాచార ఘటన మాత్రమే కాదని ఇది మరో నిర్భయ ఘటన అని అన్నారు. అత్యాచారానికి గురైన వైద్యురాలు ప్రతిఘటించిన క్రమంలో ఆమెపై విపరీతమైన దాడి జరిగిందని సామూహికంగా అత్యాచారం జరిగినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది కనుక సిబిఐ వెంటనే దర్యాప్తును పూర్తిచేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా న్యాయ విచారణ చేపట్టాలన్నారు. దేశంలో అనేక చోట్ల వైద్య సిబ్బందిపై దాడులు జరుగుతున్నాయని అత్యా చార ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు మౌనిక, లక్ష్మి, మమత, సరిత,తదితరులు పాల్గొన్నారు.

● హత్యాకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి

సిరికొండ: కలకత్తాలోని ఆర్ జీ కార్ వైద్యకళాశాల జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం , హత్యాకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం సిరికొండలో ప్రజా సంఘాల నేతలు రాస్తారోఖో చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రగతిశీల మహిళ సంఘం, పీడీఎస్‌యూ.పీవైఎల్ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం సిరికొండ తెలంగాణ చౌరస్తాలో రాస్తారోఖో చేసి నిందితుల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మృతురాలికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళ సంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు రమా మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యా చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.శిక్షణ పొందుతున్న డాక్టర్ విధులు నిర్వర్తించుచుండగా నిందితులు పాశవికంగా అత్యాచారం చేసి చంపివేయడం హేయమైన చర్య అని ఆమె ఖండించారు. దోషుల్ని పట్టుకుని కఠినంగా శిక్షించాల్సింది పోయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై మరోకరు నిందించుకోవడం సిగ్గు చేటన్నారు.జూనియర్ వైద్యురాలి ఘటనను బీజేపీ రాజకీయంగా వాడుకోవడానికి యత్నించడం విడ్డూరంగా ఉందన్నారు.సభ్య సమాజం తలదించుకునేల జరిగిన సంఘటనను మానవత్వం ఉన్న ప్రతీ ఒక్కరు ఖండించాలని రమా కోరారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఒకర్ని మరొకరు తిట్టు కోవడం మాని దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని రమా కోరారు. ఈ కార్యక్రమంలో అనీస్,ఆశీష్, పీవోడబ్ల్యూ నాయకులు ఈ.జమున,మానస,లక్ష్మి,లతా,లతిక,ప్రమీల,స్వరూప,తస్లీన్‌బేగం,ప్రేమ్‌కుమార్,రుషి వర్దన్,దామోదర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెర్కిట్‌లో క్యాండిల్ ర్యాలీ

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తాలో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లోని వైద్యవిద్యార్థినిని అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై న్యాయ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఇలాంటి సంఘటనలు దేశంలో పునరావృతం కాకుండా కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాహిద్, ఆయన్, ఇర్షాద్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

● అత్యాచారం చేసి హత్య చేసిన దుండగుల్ని వెంటనే శిక్షించాలి

మోర్తాడ్: కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిని దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన వెంటనే శిక్షించాలని ప్రజాపంథ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మోర్తాడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రైనీ డాక్టర్‌ను పాశవికంగా హించి అత్యాచారం చేసి హత్య చేయడం సిగ్గుచేటని అన్నారు. నిందితులను కేంద్ర ప్రభుత్వం పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని అన్నారు. సమాజంలో తలదించుకునేలాగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కావోద్దని అన్నారు. ఈ సమావేశంలో పీవోడబ్ల్యు జిల్లా నాయకులు సత్తెక్క, జమున, ఏఐటీకె, ఎంఎస్ డివిజన్ నాయకులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

● కామాంధులను కఠినంగా శిక్షించాలి

బోధన్‌రూరల్: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై పైశాచికంగా హత్యచేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళ సంఘం అధ్యక్షురాలు బి.నాగమణి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన కామాంధుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్ రాత్రి డ్యూటీ చేస్తున్న సమయంలో కొంతమంది సామూహికంగా కామాంధువులు అత్యాచారం చేసి హత్య చేశారని అట్టి ఘటనపై విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ పట్టణ నాయకురాలు అరుణ, యాదమ్మ, గంగామణి, లక్ష్మి, మణెమ్మ, సావిత్రి, మౌనిక, ఏఐకేఎంఎస్ నాయకులు పడాల శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

● అత్యాచారం చేసిన ఘటనపై విచారణ జరిపించాలి

ఆర్మూర్‌రూరల్: కలకత్తా వైద్యశాల విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఘటనలో సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్; ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తాలో వైద్యశాల విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనను ప్రతీఒక్కరు తీవ్రంగా ఖండించాలన్నారు. పశ్చిమబెంగాల్ అధికార పార్టీకి చెందిన కొందరు వైద్యవిద్యార్థినిపై అత్యాచారం జరిపి హత్య చేసిన సంఘటన మానవ సమాజం తలదించుకునేలా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన కొన్ని గంటల్లోనే దుండుగులు ఆసుపత్రిపై దాడి చేసి సాక్ష్యాలు దొరకకుండా చేసే ప్రయత్నం చేశారన్నారు. ప్రజలకు సేవ చేసే డాక్టర్‌లకే రక్షణ లేకుండా పోయిందన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాల్సింది పోయి రాజకీయ లబ్ధికొరకు సీఎం మొసలికన్నీరు కార్చడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనపై న్యాయం జరిగే వరకు దేశవ్యాప్త ఉద్యమం చేస్తున్న వైద్యులకు, ఐఎంఎ ప్రతినిధులకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ మాస్‌లైన్ తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఐక్యంగా ఉద్యమిద్దామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఎం.ముతె న్న, సంయుక్త కార్యదర్శి కిషన్, శేఖర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డెర ఒబాన్న విగ్రహావిష్కరణ


ఆర్మూర్‌లో ఒడ్డెర ఒబాన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు18:పట్టణంలోని 2వ వార్డు ఒడ్డెరకాలనీలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి ఆదివారం వడ్డెర ఒబా న్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ బ్రిటిష్ వారిపై విరోచిత పోరాటం చేసిన యోధుడని ఉయాల వాడ నర్సింహరెడ్డి చేసిన సహసోపేతమైన పోరులో సైనిక అధ్యక్షుడి గా నర్సింహరెడ్డి కుటుంబాన్ని ప్రజలు కాపాడిన స్వాతంత్ర్య సమర యోధుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషకరమైన విషయ మని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, అయ్యప్ప శ్రీనివాస్, ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, ఆకుల రాము, రహమన్, గండికోట రాజన్న, ఖాందేశ్ సత్యనారాయణ, వడ్డెర సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ దొంగ ధర్నాలు రైతులు పట్టించుకోవద్దు

● బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్



మోర్తాడ్‌లో సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మోర్తాడ్ ఆగస్టు18: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమే పని చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న బూటకపు ధర్నాలను రైతులు, ప్రజలు పట్టించుకోవద్దని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మోర్తాడ్‌లోని ప్రజా భవనంలో విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాకుండానే మూడో విడత రుణమాఫీ రాక ముందే రుణమాఫీ కాలేదని ధర్నాలు చేస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల వైఖరిని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. రుణామాఫీ ప్రక్రియ పూర్తికాక ముందే ధర్నా పేరుతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, సునీల్‌కుమార్ చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న వారికి లక్షల రుణమాఫీ జరిగిందన్నారు. ప్రభుత్వం రుణమాఫికి రూ.31వేల కోట్లు కేటాయించిందని, ఇప్పటికీ రూ.18వేల 500కోట్ల రుణమాఫీ జరిగిందని, రూ.12వేల 500కోట్ల రుణమాఫీ జరగాల్సి ఉందని, బ్యాంకు టెక్నికల్ సమస్యల వల్ల కొంత మందిరి రుణమాఫీ కాలేదని, రేషన్‌కార్డు లేకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో ఆరు లక్షల 50వేల కుటుంబాలకు రుణమాఫీ జరగలేదని ఆరోపించారు. రైతులు అధైర్యపడవద్దని, అందరికి రుణమాఫీ జరుగుతుందని, దొంగ ధర్నాలకు వెళ్లొద్దని సునీల్‌కుమార్ కోరారు. ప్రశాంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అని, పదేళ్ల ఏలుబడిలో బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు చేసిందేమి లేదన్నారు. రివర్స్ పంపింగ్ పేరుతో వంద కోట్ల కమిషన్ తిని ఎన్నికల్లో వేల రూపాయలు తెచ్చి ఏదో సాధించారని భ్రమపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని రైతులకు అన్ని విధాల ఆదుకుంటుందని సునీల్‌కుమార్ అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, దేవారెడ్డి, రాజేశ్వర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత బీమా చెక్కు అందజేత

బోధన్ రూరల్, ఆగస్టు 18 : బాధిత కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు ఆదివారం బీమా చెక్కును అందజేశారు. బోధన్ పట్టణంలోని ఏకచక్రనగర్ కాలనీకి చెందిన నాగేశ్వర్ నాగనాథ్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పాలసీ కట్టారని, గత డిసెంబర్ నెలలో పాలసీదారుడు మృతిచెందగా అతని కుటుంబ సభ్యులకు ఆదివారం ఈడీ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా 8.30లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హన్మంత్ రావు, ఏజీఎం సతీష్ కుమార్, డీఎం నగేష్, ఏఎం శ్రీనివాస్, ఉద్యోగులు మురళీ, సౌందర్య, రాధాశ్రీ, దిలీప్ పటేల్, సాయిబాబా, లింగారెడ్డి తదితరులున్నారు.

'ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి'

డిచ్‌పల్లి, ఆగస్టు 18 : ద్విచక్రవాహనదారులు బైకు నడుపుతున్న సమయంలో హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ సూచించారు. ఆదివారం డిచ్‌పల్లి మండలంలోని, కోరట్‌పల్లి గ్రామంలో హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకంతో ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చునని తెలిపారు. తలకు రక్షణగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ నాణ్యతతో కూడిన హెల్మెట్‌ను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'సైబర్ నేరాలపై అవగాహన అవసరం'

బోధన్ : ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌లు ధరించాలని బోధన్ పట్టణ సీఐ వీరయ్య, రూరల్ సీఐ నరేష్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, శక్కర్‌నగర్ చౌరస్తా ప్రధాన కూడళ్లలలో, రూరల్ సీఐ కోలా నరేష్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో హెల్మెట్‌ల గురించి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను మోసం చేయడానికి కొంతమంది అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్‌లతో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దు'

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 18 : రైతు రుణమాఫీపై వివిధ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జితేందర్‌రెడ్డి, బాబీలు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి రూ.32వేల కోట్లు కేటాయించగా సుమారు రూ.18వేల కోట్లు విడుదల అయ్యాయని, కొన్ని సాంకేతిక లోపాలతో కొంత మందికి రుణమాఫీ కాలేదన్నారు. త్వరలోనే సాంకేతిక లోపాలను సరి చేసి రుణమాఫీ జరుగుతుందని సూచించారు. తొమ్మిది నెలల కాలంలోనే రైతులకు రుణమాఫీ చేస్తున్నామని, సంవత్సరాలు గడిచిన రూ.లక్ష రుణమాఫీ చేయలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తప్పుడు సమాచారం అందిస్తుందని, రైతులు నమ్మవద్దని వారు కోరారు.

'లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ'

పెద్దబజార్, ఆగస్టు 18 : దేశానికి కమ్యూనిస్టులు లౌకిక శక్తులతోటే ప్రజాస్వామ్య రాజ్యాంగ రక్షణ సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో హన్మకొండలో సిపిఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజన్న, రాజరెడ్డి, భాను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, పది తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 18: ఈ విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ ఇంటర్, పది తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెద్ద కొడప్‌గల్ ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కిషోర్ తెలిపారు. ఏ తరగతి చదివిన వారైనా పదికి అర్హులని, పదో తరగతి పాసైన వారు ఇంటర్‌కు అర్హులని తెలిపారు. ఈ నెల 8న ప్రారంభమైన ప్రవేశాలు ఎలాంటి అపరాధరుసుము లేకుండా సెప్టెంబర్ 10 వరకు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల పనివేళల్లో గాని 986 6343898 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వర్ని-కోటగిరి రోడ్డుకు మహర్దశ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వర్ని, ఆగస్టు 18 : ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 4న ప్రచురితమైన ప్రమాదాలకు అడ్డాగా వర్ని-కోటగిరి రహదారి వార్తకు ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. నాన్ ప్లాన్ నిధులు రూ.1.50 కోట్ల వ్యయంతో మొదటి దఫా విడతలో 12వందల మీటర్ల డబుల్ రోడ్డు విస్తరణ బీటీ రోడ్డు కోసం ఆదివారం చర్యలు చేపట్టారు. ఆర్అండ్‌బీ నిబంధనల ప్రకారం వర్ని మండల కేంద్రంలోని మహిళ మండలి భవనం నుంచి నిర్మాణ పనుల వరకు రోడ్డు ఆక్రమణకు గురైందని, అందుకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తదుపరి చర్యలు చేపడుతామని డీఈ వెల్లడించారు. మూడునెలల్లో ప్రస్తుత నిర్మాణ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుత డబుల్ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా విస్తరించి బీటీ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. మిగతా రోడ్డు విస్తరణ కోసం ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ డీఈతో పాటు ఏఈ జీవన్ స్థానిక నాయకులు పెనుమర్తి శ్రీహరి పర్యవేక్షించారు. ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోక పలువురు ప్రాణాలు కోల్పోయ్యారని స్థానికులు గుర్తు చేశారు. ఆంధ్రజ్యోతి కథనంతో రహదారి నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ అధికారులు వేగవంతం చేయడం శుభపరిణామంగా కోటయ్య క్యాంపు, తగిలేపల్లి, అంబం, రాంపూర్, కోటగిరి ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


కొనసాగుతున్న పనులు

'రుణమాఫీతో రైతులకు అండ'



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి

కమ్మర్‌పల్లి ఆగస్టు 18 : అగస్టు 15 వరకు రెండులక్షల రూపాయల రుణమాఫీ చేసితీరుతామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రైతుబాంధవుడు సీఎం రేవంత్ అని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం కమ్మర్‌పల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండలస్థాయి కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. పదేళ్ల పాలనలో రైతులను నిట్టనిలువున ముంచిన చరిత్ర బీఆర్‌ఎస్ పాలకులదన్నారు. రైతు పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధరలు అందించక పోగా, కేసీఆర్ 12 వందల మంది రైతుల ఆత్మహత్యలకు కారకుడయ్యారని విమర్శించారు. ఏక కాలంలో లక్ష రుణమాఫీ అని చెప్పి మాటతప్పిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదికాదా అని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దేనన్నారు. అది తట్టుకోలేక ఉనికిని కాపాడుకోవడానికే ధర్నాలతో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతుద్రోహులు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులైతే రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తు రైతులను అదుకునే రైతుబాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రెండులక్షల రుణమాఫీ మాటిచ్చి అమలు జరుపుతూ రైతుల ముఖాల్లో ఆనందాన్ని తేస్తున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీ సీం రేవంత్ రెడ్డిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రణమాఫీ కోసం 31 వేల కోట్ల నిధులు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ విడతలవారిగా రైతులఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదువందల బోనస్ సైతం రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఒక పక్క రుణమాఫీ జరుగుతుంటే మరోపక్క రుణమాఫీ జరగడంలేదని విమర్శించడం తగన్నారు. ఇది కేవలం రైతులను తప్పుదారి పట్టిచడానికే ధర్నాలు చేస్తున్నారని అన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో రుణమాఫీ రాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్ని సరి చేసి త్వరలోనే అందజేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్, డీసీసీ కార్యదర్శి తక్కూరి దేవేందర్, నాయకులు బుచ్చన్న, పాలేపు నర్సయ్య, వేముల గంగారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, బుచ్చిమల్లయ్య, కొమ్ముల రవిందర్, ఏనుగు మనోహర్, అజారోద్దీన్, గణేష్ గౌడ్, శేఖర్, పత్రి రవి, అశోక్, మారయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

రుద్రూరు, ఆగస్టు 18 : ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన అకాల్వర్ శాంత (56) అనే వృద్ధురాలు ఈనెల 13 నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మాక్లూర్ గౌడ సంఘం ఏర్పాటు

మాక్లూర్, ఆగస్టు 18 : సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా మండల గౌడ సంఘం సభ్యులు సమావేశమై మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో సమావేశమై వివిధ అంశాలపై చర్చించి కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షునిగా ఎం.నారాయణగౌడ్, గౌరవ అధ్యక్షుడు భూమాగౌడ్, దశాగౌడ్ రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా నగేష్‌గౌడ్, గణేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, ప్రత్యేక సలహదారులుగా నారాగౌడ్, నర్సగౌడ్, లింబాగౌడ్, సతీష్ గౌడ్, సాయాగౌడ్, కార్యదర్శులుగా రాజుగౌడ్, గంగాగౌడ్, నారాగౌడ్, శేఖర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, కోశాధికారిగా రాజుగౌడ్, డైరెక్టర్‌లుగా మురళీగౌడ్, గంగాధర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, భూమాగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, బుచ్చగౌడ్ ఎన్నుకున్నారు.

వర్షానికి కూలిన సిద్ధరామేశ్వరనగర్ వీడీసీ భవనం

భిక్కనూరు, ఆగస్టు 18: గతరాత్రి కురిసిన భారీవర్షానికి మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ వీడీసీ భవనం ఆదివారం తెల్లవారుజామున కూలింది. ఈ గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఈ భవనం కింది గదిలోనే గ్రామపంచాయతీ కొనసాగుతుంది. కాగా ఈ భవనం కూలిన సమయంలో ఈ భవనంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ భవనం నిర్మించనప్పటి నుంచి గ్రామాభివృద్ధిలో కొనసాగుతుండగా గత ప్రభుత్వంలో మరమతుల నిమిత్తం రూ.4 లక్షలు మంజూరు కాగా పనులు ఎవరు చేపట్టలేదు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకుందని చాలాసార్లు జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి గ్రామాభివృద్ధి కమి టీకి నిధులు మంజూరు చేసి బాగు చేయించాలని గ్రామస్థులు ఈ సందర్భంగా కోరుతున్నారు.


కూలిన వీడీసీ భవనం

జాతీయ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డాక్టర్ విశాల్

పెద్దబజార్, ఆగస్టు 18: ఆగ్రాలో జరిగిన మిడ్ ఇయర్ కాన్ఫరెన్స్‌లో జిల్లాకు చెందిన ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా వృత్తినైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీంతో పాటు మరిన్ని అంశాలపైన ప్రసంగించారు.

జాన్కంపేట్‌లో సర్వాయి పాపన్న జయంతి

వేల్పూర్, ఆగస్టు 18: వేల్పూర్ మండలం జాన్కంపేట్‌లో ఆదివారం గౌసంఘాల అధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించారు. సర్వాయిపాపన్న సబ్బండవర్గాల రాజకీయ సామాజిక సమానత్వాని కృషిచేసిన వీరుడని, ఆయనలోని పోరాట పటిమను ధైర్యంను స్పూర్తిగా తీసుకొని గౌడ జాతి ఐక్యంగా ఉంటూ అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలని గౌడ సంఘం అధ్యక్షుడు శంకర్ గౌడ్ అన్నారు. గౌడవృత్తిని చేపట్టి విరమణ పొందిన బొమ్మకంటి నర్సాగౌడ్, జవ్వాజి గంగాధర్ గౌడ్‌లను శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘసభ్యులు శోబన్ గౌడ్, ఎల్లాగౌడ్, కిషోర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలో సెమీఫైనల్ చేరిన జిల్లా జట్టు

సుభాష్‌నగర్, ఆగస్టు 18 : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలో నిజామాబాద్ జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం జరిగిన క్వాటర్ ఫైనల్ పోటీలలో నిజామాబాద్-మహబూబ్‌నగర్ జిల్లా జట్లు పోటీపడగా నిజామాబాద్ జట్టు 6-0 తేడాతో సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఈ పోటీలో నిజామాబాద్ జిల్లా జట్టు తరపున భారతజట్టు క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య-2, జాహ్నవి-2, సాయిసమీక్ష-1, సుశాంతిక-1 గోల్ సాధించి జట్టు సెమీ ఫైనల్ చేరడానికి కీలకపాత్ర పోషించారు. సోమవారం నిజామాబాద్-మెదక్ జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ పోటీలను ఏఆర్ఏసిపి నాగయ్య, సీనియర్ క్రీడాకారుడు జావిద్ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జట్టు కోచ్ వక్తపాల్, మేనేజర్ అజ్మత్, అసిస్టెంట్ కోచ్ నాగరాజు పాల్గొన్నారు.

వివేకనగర్ తండాలో ఘనంగా తీజ్ పండగ

జక్రాన్‌పల్లి, ఆగస్టు18: మండలంలోని వివేకనగర్‌తండా గ్రామంలో తీజ్ పండగను గిరిజన మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వారం రోజుల నుంచి బుట్టలో గోదుమ మొలకలను పెంచారు. ఆదివారం తీజ్ పండగ సందర్భంగా తండా గ్రామ మహిళలు, గిరిజన మహిళలు గోదుమ మొలకల బుట్టలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తూ తీజ్ పండగ పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సవాల మధ్య తీజ్ పండగను జరుపుకున్నారు. అనంతరం అనంతరం గోదుమ మొలకల చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం వనభోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో గిరిజన తాండా పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పర్వతాన్ని అధిరోహించిన నాళేశ్వర్ వాసి

నవీపేట, ఆగస్టు 18 : యూరప్ ఖండంలో ఎతైన ఎల్‌బ్రస్ పర్వతాన్ని మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతి అనే పర్వతారోహకుడు ఈ నెల 17న అదిరోహించాడు. ఈ నెల 10న రాష్ట్రంలోని మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు. మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతితో పాటు రష్యాకు చెందిన మరో ఐదుగురు కలిసి మొత్తం 8 మంది సభ్యులు ఈ ఎతైన పర్వతాన్ని అదిరోహించారు. ఆర్మూర్ మారుతి గత సంవత్సరం ఆగస్టు 15న ఆఫ్రికా ఖండంలోని ఎతైన కిలిమంజారో శిఖరం, ఈ సంవత్సరం ఏప్రిల్ మాసంలో మన దేశంలోని ఉత్తర సిక్కింలో ఉన్న మంచు పర్వతాన్ని అదిరోహించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ప్రస్తుతం రష్యాలో ఉన్న ఆర్మూర్ మారుతి ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ ఐరోపా ఖండం రష్యా దేశంలో ఎల్‌బ్రస్ అనే మంచు పర్వతాన్ని అదిరోహించడం తమకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ మారుతి ప్రపంచంలో ఎతైన శిఖరాలను అదిరోహించి రాష్ట్రానికి, జిల్లాకు మంచిపేరు సంపాదించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్మూర్ మారుతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సహకాన్ని అందించాలని పలువురు కోరుతున్నారు. తాను స్వదేశం రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాన్సువాడలో కోతుల బెడద

- ఇళ్లలోకి చొరబడుతున్న వైనం
- నియంత్రణ కరువు
- ప్రజల ప్రాణాలకు ప్రమాదం
- భయాందోళనలో చిన్నారులు, ప్రజలు
- అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వినతి

బాన్సువాడ టౌన్, డిసెంబరు 18 : బాన్సువాడ పట్టణ ప్రజలు కోతుల ధాటికి బెంబేలెత్తిపోతున్నారు. రోజురోజుకు వానర సైన్యం సంఖ్య పెరుగుతూనే ఉంది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా వందల సంఖ్యలో వానరాలు స్వైరవిహారం చేస్తున్నాయి. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని గల వార్డుల్లోని ఏ కాలనీ వైపు కన్నెత్తి చూసినా కోతులే దర్శనమిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వానరాలను నియంత్రించాలని ప్రజలు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగానే ఉంది. ఏమి చేయలేని పరిస్థితి అంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ప్రజలు కోతులను తరిమేందుకు నానా యాతన పడుతున్నప్పటికీ ఫలితం మాత్రం కానరావడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

ఇళ్లలో చొరబడుతున్న వైనం...
గాయాల బారిన ప్రజలు..

వానరసైన్యం ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని శ్రీరామ కాలనీ, టీచర్స్‌కాలనీ, బేతాళస్వామి కాలనీ, పాతబాన్సువాడ, సంగమేశ్వర కాలనీలతో పాటు పలు కాలనీల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. తినుబండారాలను ఎత్తుకెళుతున్నాయి. ఎవరైనా తరిమేద్దామని చూస్తే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు గాయాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా, ఇళ్లలో నుంచి బయటకు రావాలన్నా కష్టంగా మారింది.

మరోవైపు ఎంపాక్స్....

ఎంపాక్స్ ...ఇది కోతుల నుంచి వ్యాపించే అరుదైన వ్యాధి. ప్రస్తుతం ఆఫ్రికా దేశాలను వణికిస్తోంది. ఆఫ్రికా నుంచి ఇతర దేశాలకు సైతం వ్యాప్తి చెందినట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ తెలుపుతోంది. మన దేశంలో ఎంపాక్స్ కేసులు నమోదు కాకున్నప్పటికీ అప్రమత్తత ఎంతో అవసరమని నిపుణలు పేర్కొంటున్నారు. వ్యాధి సోకినపుడు చర్యలు తీసుకునే దాని కంటే ముందే కోతుల నియంత్రణకు చర్యలు చేపడితే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎంపాక్స్ వైరస్ లక్షణాలు...

ఎంపాక్స్ వైరస్ సోకిన వారు జ్వరం, చలి, శారీరక, కండరాల నొప్పితో ఇబ్బంది పడతారు. అరచేతులు, పాదాలు, ముఖం, జననేంద్రియాలు. నోటిపై



కాలనీ పరిసరాల్లో కోతులు

కురుపులు ఏర్పడతాయి. కొన్ని కేసుల్లో మెదడు ఉబ్బడం, ఊపిరితిత్తుల్లోకి నీరు చేరడం, రక్త ప్రసరణలో ఇన్‌ఫెక్షన్ సోకడం, అంధత్వం వంటివి కనిపిస్తాయి. ఈ వైరస్ సోకిన వారు మశూచి టీకాతో 2 నుంచి 4 వారాల్లో కోలుకునే అవకాశం ఉంటుందిని వైద్యులు తెలుపుతున్నారు.

ఎంపాక్స్ ఎలా విస్తరిస్తోంది.....

ఎంపాక్స్ వైరస్ సోకిన జంతువులను కానీ, మనుషులను కానీ తాకినా, వైరస్ సోకిన జంతువు మాంసం తిన్నా ఈ వ్యాధి సోకుతుంది. అంతేకాకుండా వైరస్ సోకిన జంతువు కరిచినా, గోటి గీతలు పడినా వైరస్ అంటుంకుంటుంది. ఇప్పటికే చాలా దేశాల్లో కుక్కల్లోనూ ఈ వైరస్ కనిపించినట్లు పలు నివేదికలు తెలుపుతున్నాయి.

నియంత్రణ ఒక్కటే మార్గం....

కోతుల నుంచి వైరస్ సోకుతుందంటే అది భయపడాల్సిన విషయం. మనదేశంలో ఈ వైరస్ వ్యాప్తి చెందకముందే అధికారులు కోతులను నియంత్రించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బాన్సువాడ పట్టణంలో కోతుల నియంత్రణలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోతులే కదా అని కొందరు అధికారులు చాలా తేలికగా తీసుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కానీ వాటి నియంత్రణ కోసం కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. పరిస్థితి ఇలాగే ఉంటే మాత్రం రాబోయే రోజుల్లో మరింత పెరగనుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో గొంతు కోసుకున్న యువకుడు

బీర్కూర్, ఆగస్టు 18 : బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన అల్లం కేశవ్ అనే యువకుడు ఆదివారం మద్యం మత్తులో బ్లేడ్‌తో తన గొంతును తానే కోసుకున్నాడు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అలాగే బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు వెంటనే స్పందించి బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కేశవ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అల్లం కేశవ్ మద్యం మత్తులో ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడి బ్లేడ్‌తో గొంతు కోసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడని, మూడురోజుల క్రితం కూడా ఇలాగే గొంతు కోసుకున్నాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేశవ్ ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

బీర్కూర్, ఆగస్టు 18 : మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలుర వసతిగృహంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘననివాళి అర్పించారు. సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బోస్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంబాగౌడ్, మాధవ్ పాల్గొన్నారు.

ఎస్సీ లబ్ధిదారులు ఇంటర్వ్యూకు హాజరుకావాలి

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 18 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎస్సీ లబ్ధిదారులు ఈనెల 20న ఎంపీడీవో కార్యాలయంలో పీఎంఏజేఏవై పథకం కింద చేపల పెంపకంనకు సంబంధించి జాయింట్ ఐడెంటిఫికేషన్ కోసం హాజరుకావాలని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఈ పథకానికి సంబంధించిన లబ్దిదారులు వస్తున్నందున ఆసక్తి గల ఎస్సీ అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

మార్కండేయ మందిరంలో ప్రత్యేక పూజలు

దోమకొండ, ఆగస్టు 18 : మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా భద్రావతి-భవనా ఋషుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం 7.15కు మార్కండేయ సమేత ఉమామహేశ్వరులకు కుంభాభిషేకం, 8.15కు గణపతి పూజ, అఖండ దీపారాధాన, 9.15కు ధ్వజారోహణ, 9.30కు తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 4.15కు శ్రీ ఉమామహేశ్వరుల, మార్కండేయ స్వామి వార్ల ఊరేగింపు కార్యక్రమాలుంటాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహంలో రక్షాబంధన్ వేడుకలు

బాన్సువాడటౌన్, ఆగష్టు 18 : పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. నాకు నీవు రక్ష, నీకు నేను రక్ష, మనిద్దరం ఈ దేశానికి రక్ష అనే నినాదంతో విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిఠాయిలు తినిపించుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్, వార్డెన్ శ్యాంసుందర్ తదితరులున్నారు.

రామేశ్వర ఆలయానికి భక్తుల పాదయాత్ర

పెద్దకొడప్‌గల్, ఆగష్టు 18 : జుక్కల్ మండలంలోని లాడేగాం గ్రామం నుంచి పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో గల రామేశ్వర ఆలయానికి ఆదివారం భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. మార్గమధ్యలో బేగంపూర్ చౌరస్తా వద్ద హనుమాన్ ఆలయం వద్ద బేగంపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి అంజయ్య పాదయాత్ర భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లాడేగాం గ్రామానికి చెందిన అంతేశ్వర్ గురూజీ మాట్లాడుతూ రామేశ్వరం ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి

మాచారెడ్డి, ఆగస్టు 18 : మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శ్రావణ మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని పండితులు తెలిపారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

బాన్సువాడలో వర్షం

బాన్సువాడటౌన్, ఆగష్టు 18 : బాన్సువాడ పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. సుమారు గంటపాటు వర్షం కురియడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. కొన్ని రోజులుగా వరణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. మళ్లీ వర్షం కురియడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఆగస్టు 18 : మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

21న నగరేశ్వర ఆలయ ప్రారంభోత్సవం

బీర్కూర్, ఆగస్టు 18 :మండల కేంద్రంలో నగరేశ్వర ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ మేరకు బీర్కూర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆలయ పునర్నిర్మాణం కోసం నడుం బిగించారు. అనుకున్నట్లే ఆలయ నిర్మాణం చేపట్టారు. ఎట్టకేలకు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా 21న ఆలయ ప్రారంభోత్సవంతో పాటు విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 21న గణపతి పూజ, గో పూజ, నవగ్రహ మండల పూజ, గణపతి హోమం, 22న ప్రతిష్ఠ హోమం, కలశాభిషేకం, మంత్ర పుష్పం, 23న యంత్ర ప్రతిష్ఠ ముహూర్తం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

రుణమాఫీ చేయాలని నిరసన



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సదాశివనగర్,ఆగస్టు 18 : సదాశివనగర్ మండలం వజ్జపల్లితండాలో, మోడెగాంలో రుణమాఫీ కానందుకు నిరసనగా రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకకాలంలో రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతురుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక షరతులతో 30 శాతం రైతులకు కూడా రుణమాఫీ చేయకుండా రైతుల్లో అయోమయానికి గురిచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిల్‌కుమార్, ఉపసర్పంచ్‌లు దేవిసింగ్, రాజు తదితరులున్నారు.

ఉపాధ్యాయుడు మార్గదర్శకుడు

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డిటౌన్,ఆగస్టు 18:విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మార్గదర్శకుడు ఉపాధ్యాయుడని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో తపాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కోసం బాటలు వేస్తూ మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు నిలుస్తారన్నారు. ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నవారైనా గురువు బోధనలతోనే వారికి ఆ స్థాయి వచ్చిందనే అంశాన్ని మర్చిపోవద్దని, తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు సమాజంలో ఎలా జీవించాలో నేర్పించే మహోన్నత వ్యక్తి అని అన్నారు. అలాంటి గురువులను సన్మానించుకోవడం కోసం తపాస్ ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో తపాస్ జిల్లా అధ్యక్షుడు పులగం రాఘవరెడ్డి, వక్త వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

- మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి



పోచారంలో చిరు సంచుల ప్రదర్శన నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 18 : మాల్తుమ్మెద ప్రభుత్వ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వివిధ రకాల పంటల సాగుపై అదిక దిగుబడులు గురించి, పంటలపై సోకే వివిధ తెగుళ్ళు, వాటి నివారణ చర్యల గురించి జిల్లా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి తెలిపారు. మాల్తుమ్మెద ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో ఒక పక్కన ఈ ప్రభుత్వం ఏరువాక కేంద్రానికి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఏరువా కేంద్రంలో ఇద్దరు శాస్త్రవేత్తలు విధులు నిర్వహిస్తున్నారు. శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి మాట్లాడారు. కొత్త రకాల వరి, సోయాబీన్, పెసర, మినుము, విత్తనాలను పరీక్షించేందుకు చిరుసంచుల దశ విత్తనాలను జూన్ మాసంలో ఆయా మండలాల రైతులకు ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. చిరు సంచుల బస్తాలు మూడు కిలోల నుంచి ఐదు కిలోల వరకు ఉంటాయని ఆయన తెలిపారు. వరిలో సన్న రకాలకు చెందిన కేఎన్ఎం 12510, డబ్ల్యూజీఎల్ 1380, ఆర్ఎన్ఆర్ 31479, దొడ్డు రకం వరిలో జేజీఎల్ 28639తో పాటు వివిధ రకాలను సోయాబీన్, పెసర, మినుముల్లో వివిధ రకాలకు చెందిన చిరు సంచులను ఆయా మండలాలలో రైతులకు ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. వరి చిరు సంచుల దశ విత్తనాలను నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, కామారెడ్డి తదితర మండల రైతులకు అందజేసినట్లు, సోయాబీన్, పెసర, మినుములు చిరు సంచుల దశ విత్తనాలను మద్నూర్, పెద్ద కొడప్‌గల్, జుక్కల్ మండలాల రైతులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కొత్త రకాల విత్తనాలను రైతులు సాగుచేస్తున్నారని ఆయన వివరించారు. రైతులు సాగుచేస్తున్న ఈ కొత్త రకం పంటలను ఎప్పటికప్పుడు తాము పరీక్షిస్తున్నట్లు తెలిపారు. పంటలపైన ఏమైనా తెగుళ్ళు సోకుతున్నాయా, పంట దిగుబడి తదితర అంశాలను పరీక్షిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏమైనా సలహాలు, సూచనలు కావాల్సి ఉంటే తమను సంప్రదించి తగిన సలహాలు పొందవచ్చని అన్నారు.

'గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి'

కామారెడ్డి టౌన్, ఆగస్టు 18 : గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఖాళీల్లో పదోన్నతులను వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం వశిష్ట డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కలకత్తాలో మెడికోను అత్యాచారం చేసి దారుణంగా హత్యచేయడాన్ని తీవ్రంగా రాష్ట్రకమిటి ఖండిస్తున్నట్లు తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నిరసన ప్రదర్శన చేయడం జరిగిందన్నారు. సోమ, మంగళవారాల్లో నిరసనలు తెలుపాలని జిల్లాకమిటీ పిలుపునిచ్చిందని అన్నారు. జోన్ 1, 2లో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టుల్లో వెంటనే పదోన్నతులు చేపట్టాలని, గెజిటెడ్ పదోన్నతుల ద్వారా ఏర్పడే ఖాళీలతో పాటు ఉద్యోగవిరమణ వలన ఖాళీలుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు ఇచ్చి యస్‌జీటీ బీఎడ్ అర్హతలున్న వారికి పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతులు ఇవ్వాలని, కోర్టుకేసును సత్వర పరిష్కరించి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు విడుదల చేయాలని అన్నారు. కేజీబీవీ, 317 మ్యూచ్‌వల్ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లను పెండింగ్‌లో ఉన్న రెగ్యులర్ జీతాలను, డీఏలను అనేక రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు వేణుగోపాల్, హనుమండ్లు, రమణ, జగన్నాథం, శ్యాంరావు, రాజు, నాగభూషణ, శ్రీనివాస్, అంజయ్య, నలినిదేవి, మీనాభూషణ్, లక్ష్మీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

దోమకొండ, ఆగస్టు 18 : మండల కేంద్రంలోని గౌడ సంఘం కల్లు డిపో ఆవరణ, ముత్యంపేట ఎల్లమ్మ ఆలయం ఆవరణ, గొట్టిముక్కుల బస్టాండ్ చౌరస్తాలో ఆదివారం శ్రీ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో తీగల తిర్మల్‌గౌడ్, రాజానర్సాగౌడ్, ప్రసాద్‌గౌడ్, సుదన్శన్‌గౌడ్, రామాగౌడ్ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : సర్దార్ సర్వాయి పాపన్న అడుగుజాడల్లో పయనించాలని మండల గౌడ సోదరులకు జై గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పండరి గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో పాపన్నకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పండరిగౌడ్ మాట్లాడుతూ గోల్కొండ కోట నవాబులనే ఎదిరించి గోల్కొండ కోటపై బహుజనుల జెండా ఎగురవేశాడని తెలిపారు. కార్యక్రమం లో గౌడ సోదరులు రమేష్ గౌడ్, హన్మగౌడ్ పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్ : బాన్సువాడ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, ఓబీసీ కన్వీనర్ నాగం సాయిలు, ఓబీసీ అధికార ప్రతినిధి మక్కన్న, జిల్లా అధికార ప్రతినిధి హన్మాండ్లు, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్‌లున్నారు.



దోమకొండలో నివాళి అర్పిస్తున్న నాయకులు

నసురుల్లాబాద్ : మండల కేంద్రంలో ఆదివారం గౌడకులస్తులు సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గౌడకులస్తులు మైపాగౌడ్, సాయాగౌడ్, శ్రవణ్ గౌడ్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట : మండల కేంద్రంలోని రేణుకా మాత ఆలయంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు కలాలి యాదగిరి గౌడ్, నాయకులు వంశీగౌడ్, రామా గౌడ్, లచ్చాగౌడ్, నారాగౌడ్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని గౌడ సంఘంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మత్తమాల ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు.

లింగంపేట : మొదటి బహుజన వీరుడు సరాయి పాపన్నగౌడ్ అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శంకర్‌గౌడ్, రవిగౌడ్, సిద్ధగౌడ్, బుజ్జాగౌడ్, ప్రసాద్‌గౌడ్, రాముగౌడ్, రామలింగంగౌడ్, మనోహర్ గౌడ్‌లతో పాటు భైరయ్య, ఫతియోద్దీన్, రఫీఖ్, రాజు, అశోక్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉన్నారు.

రాజంపేట : మండలంలోని పలు గ్రామాలలో సర్ధార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి వేడుకలను గౌడకులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొండాపూర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి పాపన్న అందరికోసం పాటుపడ్డారన్నారు.

భిక్కనూరు :పలు గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గౌడ సంఘం ప్రతినిధులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గౌడసంఘం ప్రతి నిధులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పాపన్నగౌడ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకుసాగాలన్నారు.

రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మోసగించింది

- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్

కామారెడ్డిటౌన్, ఆగస్టు 18 : గత 9 నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కొర్రిలు పెడుతూ వారిని మోసగించిందన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎక్కడికి వెళ్తే అక్కడ దేవుళ్లపైన ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ఒక బూటకమన్నారు. కామారెడ్డిలో ఏ సొసైటీకి వెళ్లిన రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపేందుకు తాము సిద్ధమన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు రాజీనామా చేయాలని వ్యాఖ్యలు చేయడం, ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గుండాలు దాడిచేయడం సిగ్గుచేటని అన్నారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడిన బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన ప్రతిపక్ష పార్టీగా నిలబడుతుందన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ మెడలు వంచి చేయిస్తామని, రెండు లక్షల రుణమాఫీ చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గతి తప్పిన పాలన సాగుతుందని, రైతుబంధు ఇవ్వక రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని మానసికంగా దెబ్బతియాలని కాంగ్రెస్ పార్టీ చూస్తుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- డబుల్ ఇస్మార్ట్
దర్శన్	- మిస్టర్ బచ్చన్
ప్రియా 70	- తంగలన్
ప్రియా 35	- సరకాతి కా అటాంక్

బాన్సువాడ

మహేశ్వరి	- మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర	- డబుల్ ఇస్మార్ట్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

